# వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు




వివరాలు మెయిన్‌లో...


# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 25 జూన్, 2026 | పేజీలు : 08


## మానసిక వికలాంగులకు విద్యనందించడం గొప్ప అదృష్టం

### మానసిక వికలాంగుల పాఠశాలను సందర్శించిన రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా

**ప్రజాపక్షం/కరీంనగర్:** మానసిక వికలాంగులకు విద్యనందించడం గొప్ప అదృష్టమని, వారికి విద్యతో పాటు నైపుణ్యాలను అందించి స్వావలంబన దిశగా తీర్చిదిద్దడం ప్రశంసనీయమని రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు.బుధవారం తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలో జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక వికలాంగుల పాఠశాలను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సందీప్ కుమార్ సుల్తానియా, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, ఇతర అధికారులు మొక్కలు నాటారు.

అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, హాస్టల్, డైనింగ్ హాల్, వృత్తి విద్యా శిక్షణ కేంద్రాలు, ఇతర సౌకర్యాలను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. మానసిక వికలాంగుల కోసం నిర్వహిస్తున్న వృత్తి విద్యా శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన సందీప్ కుమార్ సుల్తానియా, విద్యార్థులు ప్రదర్శిస్తున్న ప్రతిభను అభినందించారు. విద్యార్థులలోని నైపుణ్యాలను వెలికితీసి వారికి ఉపాధి అవకాశాలు కల్పించేలా శిక్షణ ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పాఠశాల కార్యకలాపాలు, విద్యార్థులకు అందిస్తున్న సేవలు, ఎదురవుతున్న అవసరాలను సందీప్ కుమార్ సుల్తానియా, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు వివరించారు. పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందించాలని కోరారు.అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ సభ్యులతో సమావేశమైన సందీప్ కుమార్ సుల్తానియా, పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. మానసిక వికలాంగుల విద్య, సంక్షేమం కోసం చేస్తున్న సేవలు సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. విద్యార్థుల అభివృద్ధికి అవసరమైన అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకునేలా చూస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, ట్రైనీ కలెక్టర్ హరిప్రసాద్, ఆర్డీవో షర్మిల, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ సభ్యులు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి విద్యాభివృద్ధికి 'హల్' చేయూత

### సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కృషికి ఫలితం



**ప్రజాపక్షం/జగిత్యాల:** జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలో ఉన్నత విద్యా అవకాశాల విస్తరణకు మరో కీలక అడుగు పడింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల కింద రూ.10 కోట్ల వ్యయంతో ధర్మపురిలో నూతన డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి ముందుకు వచ్చింది.సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవ ఫలితంగా బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో హెచ్ఏఎల్ ప్రతినిధులు, జగిత్యాల జిల్లా యంత్రాంగం మధ్య అవగాహన ఒప్పందం (ఎమ్ఒయు) కుదిరింది.జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్,హెచ్ఏఎల్ హైదరాబాద్ చీఫ్ ఆఫ్ ప్రాజెక్ట్స్ ఎ.వి. మురళీకృష్ణ, డీజీఎం సూర్యకాంత్ రౌత్, సీనియర్ మేనేజర్ ఎస్. సత్యనారాయణ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ విద్యాభివృద్ధే సమాజ అభ్యున్నతికి మూలాధారమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల్లో విద్యా మౌలిక వసతుల కల్పన ద్వారా సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించవచ్చని పేర్కొన్నారు.ధర్మపురి, వెల్గటూరు, పెగడపల్లి, గొల్లపల్లి తదితర మండలాలకు చెందిన వేలాది మంది విద్యార్థులకు ఈ డిగ్రీ కళాశాల వరంగా మారనుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రాంతీయ యువతలో ఉన్నత విద్యపై ఆసక్తి పెరిగి, ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని పేర్కొన్నారు.సిఎస్ఆర్నిధులను సామాజికాభివృద్ధికి వినియోగిస్తూ విద్యా రంగానికి హెచ్ఏఎల్ సంస్థ అందిస్తున్న సహకారం ఆదర్శప్రాయమని పేర్కొంటూ, హెచ్ఏఎల్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ కె. రవి, యాక్సెసరీస్ కాంప్లెక్స్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి ఎం. సత్యనారాయణ, హెచ్ఏఎల్ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామమోహనరావు, హెచ్ఏఎల్హైదరాబాద్ చీఫ్ ఆఫ్ ప్రాజెక్ట్స్ ఎ.వి. మురళీకృష్ణతో పాటు హెచ్ఏఎల్ యాజమాన్యానికి మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ధర్మపురి ప్రాంత విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సిఎస్ఆర్ నిధుల కింద ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సహకరించిన హెచ్ఏఎల్సంస్థ ప్రతినిధులను మంత్రి ఈ సందర్భంగా శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల అదనపు కలెక్టర్ రాజాగౌడ్, మంత్రి ఓఎస్డీ వై.జె. విజయ్ కుమార్, జిల్లా అధికారులు, హెచ్ఏఎల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్ఒలు ఇంటింటికీ వెళ్లి ఫారాలు అందించాలి

### ఎఇఆర్ఒలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి:జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
### ఎస్ఐఆర్‌పై ఆర్‌డిఒలు, తహసీల్దార్లు, సిడిపిఒలతో జిల్లా కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో ఈ నెల 25వ తేదీ నుంచి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా బిఎల్ఒలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై జిల్లాలోని ఆర్‌డిఒలు, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల పరిధిలోని తహసీల్దార్లు(ఎఇఆర్ఒ), సిడిపిఒలతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. తహసీల్దార్లు(ఎఇఆర్ఒ) తమ పరిధిలోని బిఎల్ఒలతో ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని, గుర్తింపు కార్డుతో బిఎల్ఒలు, బిఎల్ఏలతో కలిసి ఇంటింటికీ వెళ్లాలని ఆదేశించారు. తహసీల్దార్లు(ఎఇఆర్ఒ)లు క్షేత్ర స్థాయిలో సందర్శించి.. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. జన గణనలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలవడంతో తహసీల్దార్లు, ఇతర అధికారులను అభినందించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒలు శ్రీధర్ బాబు, కెవెస్బికుమారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, మెప్మా ఎఒమీర్జా ఫసహత్ అలీ బేగ్, సిడిపిఒలు తదితరులు పాల్గొన్నారు.

## 1 లోగా ప్రభుత్వ జూనియర్ కళాశాల దుకాణాలు ఖాళీ

### పెద్దపల్లి జిల్లా కలెక్టర్ మౌఖిక ఆదేశాలు
### లీజుదారులకు ఆఖరి నోటీసు




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర) ప్రాంగణంలో ఉన్న దుకాణ సముదాయాల లీజుదారులు తమ షాపులను జులై 1వ తేదీ లోగా పూర్తిగా ఖాళీ చేసి, కళాశాల యాజమాన్యానికి అప్పగించాలని అధికారులు ఆఖరి నోటీసును జిల్లా కలెక్టర్ శ్రీ కోయ హర్ష జారీ చేశారు.గతంలో 29.11.2021 రోజున కళాశాల ప్రిన్సిపాల్‌కు, లీజుదారులకు మధ్య జరిగిన మడిగల (షాప్స్) లీజ్ ఒప్పందం 31.03.2024 నాటికే ముగిసింది. ఆ తర్వాత హైదరాబాద్ డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ విద్య వారి ఉత్తర్వుల ప్రకారం (Proc.No.CIEAII/SC/1/2024ACADII, డేట్: 07.05. 202 5)పెరిగిన అద్దెను బహిరంగ వేలం ద్వారా నిర్ణయించాల్సి ఉంది. ఇం దులో భాగంగా కొత్త వేలం నిర్వహించేందుకు వీలుగా లీజుదారులు తమ షాపులను ఖాళీ చేసి ప్రిన్సిపాల్‌కు స్వాధీనం చేయాలని ఆదేశించారు.కమీషనర్ ఆదేశాల ప్రకారం 01.04.2024 నుండి 31.07 .20 25 వరకు నెలకు రూ. 8,000/ చొప్పున అద్దె చెల్లించాల్సి ఉంది. ఇం దులో భాగంగా నెలకు రూ. 1,500 చొప్పున పెరిగిన అద్దె బకాయిల ను, అలాగే విద్యుత్ బిల్లుల బకాయిలను లీజుదారులు వెంటనే పూర్తిగా చెల్లించాలని నోటీసులో పేర్కొన్నారు. లీజుదారులకు రావలసిన పాత డి పాజిట్ మొత్తాన్ని కళాశాల నుండి తిరిగి పొందవచ్చని తెలిపారు.ఈ వి షయమై గతంలో 31.05.2025, 11.07.2025, 31.07.2025, 30 .08.2025 తేదీలలో నాలుగు సార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, కొం దరు లీజుదారులు ఇప్పటివరకు దుకాణాలను ఖాళీ చేయలేదు, అద్దె బకాయిలు కూడా చెల్లించలేదు. దీనిపై పెద్దపల్లి జిల్లా కలెక్టర్ స్పందిస్తూ మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత లీజుదారులు 01.07.20 26 లోగా తమ దుకాణాలను పూర్తిగా ఖాళీ చేసి, బకాయిలన్నీ చెల్లించి, తాళాలను కళాశాల కార్యాలయంలో అప్పగించాలని స్పష్టం చేశారు. ఒ కవేళ నిర్దేశిత గడువులోగా ఖాళీ చేయని పక్షంలో, జిల్లా పరిపాలన ,పోలీస్ శాఖ సహాయంతో దుకాణాలను బలవంతంగా మూసివేసి, స్వాధీనం చేసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# అర్హులకు ఓటు హక్కు కల్పించడమే 'సర్'లక్ష్యం



### రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.ఎస్ఐఆర్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. జిల్లాలో మొత్తం 549 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 55 మంది బీఎల్ఓ సూపర్ వైజర్లు, 549 మంది బీఎల్ ఓలు ఉన్నారని వెల్లడించారు. జిల్లాలో 4,75,694 మంది ఓటర్లు ఉండగా, 2,28,579 మంది పురుషులు, 2,47,072 మహిళలు, 43 మంది ట్రాన్స్ జెండర్స్ ఉన్నారని వెల్లడించారు. వీరిలో 4,04,414 మంది మ్యాపింగ్ పూర్తి అయిందని, ఇంకా 71,280 మంది ఇంకా మ్యాపింగ్ చేయాల్సి ఉందని తెలిపారు. ఓటర్ జాబితాలో ఉన్న ఓటర్ల అందరికీ బీఎల్ఓలు ఈ నెల 25 వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు ఇంటింటికీ వచ్చి ఎన్యూమరేషన్ ఫారాలు ఇస్తారని పేర్కొన్నారు. బీఎల్వోలు ఇంటింటికి వచ్చినప్పుడు ఓటర్లు పూర్తి వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించాలని, అలాగే ప్రస్తుత పాస్ పోర్ట్ సైజ్ ఫొటో తప్పనిసరిగా జూలై 31వ తేదీలోగా అందజేసి.. రసీదు తీసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన బీఎల్వో ఎవరో ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫారాలు నింపడంలో సహాయం అందించాలని ఆదేశించారు. ఫారాలతో పాటు ఎలాంటి గుర్తింపు కార్డుల జిరాక్స్ పత్రాలు ఇవ్వాల్సిన అవసరం లేదని, గుర్తింపు కార్డు వివరాలు బీఎల్ఓ లకు ఇవ్వాలని సూచించారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ 31వ తేదీ జూలై రోజున పబ్లిష్ అవుతుందని తెలిపారు. ప్రతి ఓటరు తన పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉందో లేదో పరిశీలించాలని, అభ్యంతరాలు, ఫిర్యాదులు, కొత్త క్లెయిమ్‌లు ఉంటే ఆగస్టు 30వ తేదీలోగా సమర్పించాలని సూచించారు. డ్రాఫ్ట్ జాబితా విడుదలైన తర్వాత మ్యాపింగ్ సరిగా కాకపోతే ఎన్నికల అధికారులు సంబంధిత వారికి నోటీసులు జారీ చేస్తారని తెలిపారు. ఆ సమయంలో భారత పౌరసత్వ నిబంధనల ప్రకారం పుట్టిన సంవత్సరాన్ని ఆధారం గా తీసుకుని అవసరమైన పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని చెప్పారు. సెప్టెంబర్ 28, 2026 నాటికి అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిష్కరించి, అక్టోబర్ 1, 2026న తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. అక్టోబర్ 1, 2026ను ప్రమాణిక తేదీగా తీసుకుని అప్పటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇల్లు తాళం వేసి ఉంటే బీఎల్వోలు మూడు సార్లు సందర్శిస్తారని చెప్పారు. ఓటర్లు voter.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా ఎన్యూమరేషన్ ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూరించవచ్చని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు లేకపోతే ఫారం–6 ద్వారా మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయిలో బీఎల్ఏలను నియమించి.. వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని సూచించారు. జిల్లాలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదనేదే జిల్లా యంత్రాంగం లక్ష్యమని పేర్కొన్నారు. దేశంలో అర్హులైన ఓటరు ఒకే చోట ఓటు హక్కు కలిగి ఉండాలనేది ఎన్నికల సంఘం లక్ష్యమని స్పష్టం చేశారు. ఒక వ్యక్తి ఒక చోట కాకుండా ఎక్కువ చోట్ల ఓటు హక్కు కలిగి ఉండడం నేరమని తెలిపారు. ఇంటింటి సర్వే సమయంలో బీఎల్వోలకు బీఎల్ఏలు సహకరించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని, సరైన పత్రాలతో ఫారాలు నింపడంలో సహాయం చేయాలని సూచించారు. మరణించిన ఓటర్లు, డూప్లికేట్ ఓట్లు, రెండు చోట్ల ఓటు ఉన్న వారి వివరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. జిల్లాలోని ఓటర్లు అందరూ తమ వద్దకు వచ్చే బీ ఎల్ ఓ లకు సహకరించి.. తమ వివరాలు, ఫారాలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్లో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/వీర్నపల్లి:**మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ లో 6 నుండి 8వ తరగతి వరకు సోషల్ సబ్జెక్టు, 9,10 , ఇంటర్మీడియట్ తరగతులకు తెలుగు సబ్జెక్టు భోదించుటకు ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు సమర్పించాల్సిందిగా పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెఆశోక్ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. అభ్యర్థులు టిజిటి సోషల్ సబ్జెక్టు గాను సంబంధిత సబ్జెక్ట్‌లో డిగ్రీ, బీఎడ్ , టెట్, పిజిటి తెలుగు సబ్జెక్టుకు ఎంఎతెలుగు ,బి.ఎడ్ అర్హతలు కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 27వ తేది శనివారం ఉదయం 10 గంటలకు వీర్నపల్లి మోడల్ స్కూల్లో సర్టిఫికెట్స్ తో పాటు డెమో క్లాసు కి హాజరు కావల్సిందిగా కోరారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

### మండల విద్యాధికారి రాఘవులు

**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ మండల పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాల ఆవరణలోనే పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారాలు మరియు ఇతర విద్యా సామగ్రిని విక్రయించడం, తల్లిదండ్రులను నిర్దిష్ట పుస్తకాలు లేదా వస్తువులు కొనుగోలు చేయాలని బలవంతపరచడం నిబంధనలకు విరుద్ధమని బుధవారం మండల విద్యాధికారి రాఘవులు ఒక ప్రకటనలో తెలియజేశారు.అదేవిధంగా,పాఠశాల వాహనాలలో నిర్దేశిత సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలించ కూడదని ,విద్యార్థుల భద్రత దృష్ట్యా పాఠశాల బస్సులు ,ఇతర వాహనాలలో అనుమతించబడిన పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించరాదని అన్నారు.అందువల్ల రాయికల్ మండల పరిధిలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠశాల ప్రాంగణంలో పుస్తకాలు, నోట్‌బుక్స్,యూనిఫారాలు ,ఇతర వస్తువుల విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని,అలాగే పాఠశాల వాహనాలలో అధిక సంఖ్యలో విద్యార్థులను తరలించకుండా రవాణా శాఖ,విద్యాశాఖ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.నిబంధనలను ఉల్లంఘించిన పక్షంలో సంబంధిత పాఠశాలలపై శాఖాపరమైన , చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

### ధర్మపురి ఎస్ఐ జి మహేష్

**ప్రజాపక్షం/ధర్మపురి :** విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ధర్మపురి ఎస్ఐ జి మహేష్ అన్నారు. బుధవారం మండలం లోని మగ్గిడి మోడల్ స్కూల్‌లో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ జి. మహేష్ మాట్లాడుతూ, డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం యువత ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా వారి విద్యా ప్రగతి, వ్యక్తిత్వ వికాసం భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. మత్తు పదార్థాల బారిన పడిన యువత సామాజిక, ఆర్థిక మరియు మానసిక సమస్యలను ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు.విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు,సృజనాత్మక కార్యకలాపాలు ,నైతిక విలువలపై దృష్టి సారించాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు సమాజంలోని ప్రతి ఒక్కరూ కలిసి యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారుఫో.అలాగే తమ పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయం, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసు శాఖకు తెలియజేయాలని కోరారు. సమాజంలో డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు,పోలీసు సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

## పలు శుభకార్యాలలో పాల్గొన్న నిశాంత్ రెడ్డి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని మల్లన్న పేట గ్రామంలో బుధవారం గ్రామానికి చెందిన ముత్యాల మోహన్ కుమార్తె వివాహ వేడుకలో గొల్లపల్లి మాజీ సర్పంచ్ ,మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి,ఏఎంసీ చైర్మన్ బీమా సంతోష్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.అనంతరం భీంరాజుపల్లి గ్రామానికి చెందిన చింతల వసంత రవీందర్ దంపతుల కూతురి నూతన వస్త్రలంకరణ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆత్మకూరు గ్రామానికి చెందిన అత్తెన కుమార్ కూతురి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు . ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రెవెళ్ళ సత్యనారాణ గౌడ్,నాయకులు అత్తెన శివరాజం,మార్కెట్ కమిటీ డైరెక్టర్ అత్తెన శివయ్య,తదితరులు పాల్గొన్నారు.

## భూసర్వే రైతులపాలిటశాపంగా మారిందా..!

### అధికారుల ఆంక్షలతో రైతుల దిగేలు

**ప్రజాపక్షం/ మల్లాపూర్ :** పునరావాస గ్రామాలుగా ఉన్నది కూడా కుస్తాపూర్ ,రత్నాపూర్, సంగెం శ్రీరాంపూర్ గ్రామాల పరిధిలోని రైతులకు వారి భూములు అమ్ముకోవాలన్న, అవసరమై లోన్ నిమిత్తం మార్టిగేజ్ చేయాలన్న రెవెన్యూ అధికారుల ఆంక్షలతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి భూ రీ సర్వే కొందరి రైతుల పాలిట శాపంగా మారింది. ఐదు గ్రామాలలో ఉన్న భూములు చిక్కుముడిగా ఉండడంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ రీ సర్వే నత్త నడకన సాగుతుండడంతో అసలైన రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. 30 సంవత్సరాలకు పైగా పట్టాలు కలిగి ఉండి మోకా మీద వ్యవసాయం చేసుకుంటున్న తమకు బ్యాంకు లోన్ నిమిత్తం వెళ్లిన,మరే ఇతర అవసరాలకు భూమిని తాకట్టు పెడదాం అన్నా అధికారులు పెడుతున్న నానా ఇబ్బందులకు రైతులు హరి గోసపడుతున్నారు.భూ సర్వే జరుగుతున్న తాము అర్జీలు పెట్టుకున్న సర్వే నెంబర్లపై నిజమైనవో కాదో మోకా మీదకు వచ్చి తెలుసుకోవాల్సిన అధికారులు తమ బాధను పట్టించుకోకుండా ఉండడంతో బ్యాంకులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నామని పలువురు బాధిత రైతులు వాపోతున్నారు. ఈ విషయమై ఇటీవలే ఓ సమావేశంలో ఒకరిద్దరు రైతులు స్థానిక ఎమ్మెల్యే సంజయ్ దృష్టికి సైతం తీసుకెళ్లినప్పటికీ రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే సైతం పరిష్కరించాలని ఆదేశించినప్పటికీ సమస్యకు పరిష్కారం దొరకడం లేదని కన్నీరు మున్నీరవుతున్నారు. ఎవరో చేసిన అక్రమాలకు అసలు సిసలైన రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అనేకమైనప్పటికీ అధికారులు పెట్టే ఆంక్షలతో పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. బతికుండగానే చంపేసి పట్టాలు చేసే అధికారులు , తమ పట్టా భూములను అవసర నిమిత్తం బ్యాంకులోన్లు పెట్టుకుందామంటేఆంక్షలువిధించడం ఆలోచించాల్సిన విషయమే.ఈ విషయమైజిల్లాఉన్నతస్థాయిఅధికారులు దృష్టిసారించి రైతులు పడుతున్న బాధలను తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కొండగట్టు అంజన్న నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1 లక్ష విరాళం



**ప్రజా పక్షం/మల్యాల:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు కూకట్ పెల్లి కి చెందిన పొన్నాల రంగ ధ్రువన్ లక్ష రూపాయల విలువగల చెక్కును ఇఒ అంజనా రెడ్డి కి బుధ వారం అందజేశారు. ఈ సందర్భంగా ఇఒ అంజనారెడ్డి మాట్లాడుతూ నిత్యాన్నదాన కార్యక్రమానికి తమ వంతు సహాయంగా దాతలు విరాళాల రూపంలో అందించే సహకారం ఎంతో కీలకమని ఆయన తెలిపారు.అనంతరం ఆలయ అధికారులు దాతకు కృతజ్ఞతలు తెలియజేసి, స్వామివారి ప్రసాదం ఆశీర్వచనాలను అందజేశారు.సూపరెంటెంట్‌సునీల్‌టెంపుల్ ఇన్స్‌పెక్టర్ అశోక్ ఉన్నారు.

# వేములవాడ గోశాలలో రైతులకు కోడెల పంపిణీ చేసిన ప్రభుత్వ విప్

### 100 మంది రైతులకు కోడెల అందజేత

### వ్యవసాయానికే కోడెలను ఉపయోగించాలి..

### దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవు



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ గోశాలలో బుధవారం రైతులకు కోడెల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, రాజన్న ఆలయ ఇఒరమాదేవి, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజుతో కలిసి ఆయన రైతులకు కోడెలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, భక్తులు స్వామి వారికి భక్తిశ్రద్ధలతో సమర్పించిన నిజ కోడెలను రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కోడె మొక్కులు చెల్లించే విశిష్టమైన సంస్కృతి ఒక్క వేములవాడ రాజన్న సన్నిధిలోనే ఉందని ఆయన కొనియాడారు. గోశాలలో ఉన్న కోడెల కోసం ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హులైన రైతులను గుర్తించి, నేడు 100 మందికి వీటిని అందజేశామని చెప్పారు. భవిష్యత్తులో ఇతర జిల్లాల రైతులకు కూడా కోడెలను పంపిణీ చేస్తామని వెల్లడించారు. రైతులు తమకు అందిన కోడెలను కేవలం వ్యవసాయ పనులకు మాత్రమే ఉపయోగించాలని, వాటిని జాగ్రత్తగా సంరక్షిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కోరారు. ఒకవేళ ఎవరైనా ఈ కోడెలను దుర్వినియోగం చేస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోశాల అభివృద్ధి కోసం మర్రిపల్లిలో 40 ఎకరాల భూమిని కేటాయించామని, త్వరలోనే అక్కడ అధునాతన పద్ధతిలో సరికొత్త గోశాల నిర్మాణం చేపడతామని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## పరామర్శ



**ప్రజాపక్షం /కొత్తపల్లి :**తెలంగాణ పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి మాతృమూర్తి ఇటీవల మరణించగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి బుధవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మాచనపల్లి గ్రామానికి వెళ్లి తిరుపతమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించినవారిలో ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు సదానందం, రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, సిపిఐ కౌన్సిల్ సభ్యులు గజ్జి ఐలయ్య, మాదరపు రత్నాకర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## వార్డులను సందర్శించిన చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్



**ప్రజాపక్షం / జమ్మికుంట :**జమ్మికుంట పట్టణ పరిధిలో కురుస్తున్న వర్షాలకు గాను హౌసింగ్‌బోర్డు కాలనీ, అంబేద్కర్ కాలనీ, నాయినీ చెరువు పరిసరాలను బుధవారం మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా ప్రధాన సమస్య వరద నీరు వల్ల పట్టణ ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకుగాను ముందస్తు చర్యలు చేపట్టాలని మా పాలకవర్గం అనునిత్యం పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటామని అన్నారు. ప్రజలు ఏలాంటి సమస్యలు ఉన్నా టోల్ ఫ్రీ నంబర్ కు సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పొనగంటి రాము, చందా రాజు, నాయకులు శ్రీపతి నరేశ్ మంద రాజేశ్, బోళ్ల సదానందం తదితరులు పాల్గొన్నారు.

## విధుల పట్ల సమర్థవంతంగా వ్యవహరించాలి

**ప్రజాపక్షం/శంకరపట్నం:**ప్రజలతో మరింత స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అడిషనల్ డిసిపి(అడ్మిన్) వెంకటరమణ సూచించారు.బుధవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు.స్టేషన్ లోని పలు రికార్డులను పరిశీలించి నేరాల నియత్రణపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా సిసిటిఎన్‌ఎస్ వ్యవస్థ పనితీరును సమీక్షించి అవసరమైన మార్గదర్శకాలను అందించారు.అనంతరం సిబ్బందితో సమావేశమై మాట్లాడుతూ డిజిపి ఆదేశాలను అమలు చేయాలనిప్రజలకు మరింత చేరువలో ఉంటూ స్నేహపూర్వకంగా వ్యవహరిస్తు నియంత్రణకు కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఎసిపి మాధవి,రూరల్ సిఐ శ్రీనివాస్,ఎస్ఐ శేఖర్ రెడ్డి,సిబ్బంది పాల్గోన్నారు.

## ఘనంగా గంగా పార్వతి రాజరాజేశ్వర స్వామివార్ల కళ్యాణం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది



**ప్రజాపక్షం/ వేములవాడ:** వేములవాడ పట్టణంలోని గంగాపుత్రుల ఆధ్వర్యంలో శ్రీ గంగా పార్వతి రాజరాజేశ్వర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై స్వామి అమ్మవార్లను పట్టు వస్త్రాలు సమర్పించి దర్శించుకుని కళ్యాణంలో పాల్గొన్నారు. అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య సంప్రదాయబద్ధంగా శ్రీ గంగా పార్వతి రాజరాజేశ్వర స్వామి వార్ల కళ్యాణ తంతు నిర్వహించారు. ఈ వేడుకకు భారీ సంఖ్యలో భక్తులు, గంగపుత్రులు తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కిక్కిరిసిపోగా, భక్తి గీతాలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన కళ్యాణ మహోత్సవం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. గంగపుత్రులు, స్థానిక ప్రజలు, మహిళలు విశేషంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం అనంతరం గంగమ్మ తల్లికి బోనం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ ,మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ మాధవి రాజు,నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, కో ఆప్షన్ మెంబర్ పీర్ మహమ్మద్ , గంగపుత్ర సంఘం సొసైటీ అధ్యక్షులు పంపరి శంకర్, సంఘం అధ్యక్షులు కూర పరిశయ్య, పంపరి దేవయ్య, కూర దేవయ్య, గంగపుత్ర యూత్ అధ్యక్షులు కూర దేవేందర్, కూర బాలరాజు, పంపరి గోపాల్ , కూర లచ్చయ్య, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగాన్ని నిరాకరించాలి

### నేత్ర స్కిన్ హాస్పిటల్ వైద్య నిపుణులు డా.హర్షిణి పెనాల,యాజమాన్యం




**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రకృతిని కాపాడాలని నేత్ర స్కిన్ హాస్పిటల్ వైద్య నిపుణులు డా.హర్షిణి పెనాల, యాజమాన్యం, సిబ్బంది పిలుపునిచ్చారు. జగిత్యాలలోని నేత్ర స్కిన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వైద్యులు, యాజమాన్యం, సిబ్బంది కలిసి బుధవారం “ప్లాస్టిక్ వాడకం వద్దు – పర్యావరణం మనకు ముఖ్యం” అనే సందేశంతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు నేల, నీరు, గాలి కాలుష్యానికి ప్రధాన కారణమవుతున్నాయని వారు తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలని వైద్య నిపుణులు డా.హర్షిణి పెనాల సూచించారు. ప్లాస్టిక్ సంచుల స్థానంలో వస్త్ర లేదా జూట్ బ్యాగులను ఉపయోగించాలని డా.హర్షిణి పెనాల ప్రజలను కోరారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, చిన్న చిన్న మార్పుల ద్వారా పెద్ద ఫలితాలను సాధించవచ్చని డా.హర్షిణి పెనాల పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం సంపత్ కుమార్, సుబాన్, వంశీ,సిబ్బంది అలేఖ్య, ప్రణీత,మనోజ,నరేందర్ పాల్గొని ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

## 7న ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేయాలి

### ఎం ఆర్ పి ఎస్ కోఆర్డినేటర్ చెట్పల్లి లక్ష్మ ణ్



**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం:** జూలై 7న మండలంలోని ప్రతి గ్రామంలో ఎం ఆర్ పి ఎస్ జెండా ఎగరవేయాలని కోరుట్ల నియోజకవర్గ కోఆర్డినేటర్ చెట్టుపెల్లి లక్ష్మ ణ్ ఎం ఆర్ పి ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన గో టు విలేజ్–40 డేస్ కార్యక్రమంలో బంగారి హరిదాసును ఎం ఆర్ పి ఎస్ మండల కన్వీనర్‌గా నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. అనంతరం లక్ష్మ ణ్ మాదిగ మాట్లాడుతూ, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలని, జూలై 7న ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేసి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కనక దినేష్, కొండల నరసయ్య, బంగారి అజయ్, నల్లూరి గంగారం, బొమ్మేన దశరత్, గొర్రె శ్రీనివాస్, కనుక జగన్, సాగర్ రాజారపు, తిమ్మని సుమన్,తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ పొందనున్న జి.ఎంకు ఆత్మీయ సన్మానం




**ప్రజాపక్షం/రామగిరి :** బుధవారం జి.ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న కార్పోరేట్ భూగర్భ గనుల విభాగం జనరల్ మేనేజర్ వై.రామిరెడ్డి ని రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, ఏరియాలోని వివిధ గనుల,విభాగాధిపతులతో కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వై.రామిరెడ్డి సింగరేణి సంస్థలో 38 సంవత్సరాల పాటు వివిధ ఏరియాలలో, వివిధ గనులు,విభాగాలలో, వివిధ హోదాలలో విధేయతతో, అంకితభావంతో అందించిన సేవలు అందరికీ ఆదర్శమన్నారు.పలు సంస్కరణలు చేపట్టి ఉన్నతాధికారుల మన్ననలు పొందారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్వోటుజిఎం యం.రామ్మోహన్, ఏరియా ఇంజినీర్లు ఎ.ఉదయభాస్కర్, వి.దూప్ సింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్ వి ఫాటింగ్, విభాగాధిపతులు బి.టి.మురళీ కృష్ణ, సి.జె.సురేఖ,బి.సుదర్శనం, షబ్బీరుద్దీన్, రవిచరణ్,రాజేశ్వరి,ఆసిఫ్ యాసిన్, ప్రాజెక్ట్ ఇంజనీర్లు చంద్ర శేఖర్, జ్ఞానసంబంధన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## లీడ్‌సేఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

**ప్రజాపక్షం / కొత్తపల్లి :**పిల్లల ఆరోగ్యం, మేధో వికాసంపై సీసం (లెడ్) చూపే దుష్ప్రభావాల పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యంగా లీడ్‌సేఫ్ స్వచ్ఛంద సంస్థ కొత్తపల్లి మండలం మల్కాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రొటెక్టింగ్ చిల్డ్రన్ త్రూ లీడ్ స్క్రీనింగ్, న్యూరోకాగ్నిటివ్ అసెస్‌మెంట్ అండ్ కమ్యూనిటీ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో సీసం శాతాన్ని గుర్తించడానికి లీడ్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సీసం ప్రభావం వల్ల పిల్లల మెదడు ఎదుగుదల, ఆలోచనా శక్తి ఏ విధంగా దెబ్బతింటోందో న్యూరోకాగ్నిటివ్ అసెస్‌మెంట్ ద్వారా వివరించారు. విషపూరిత సీసపు ప్రభావం లేని సమాజాన్ని నిర్మించడంలో సమాజం, తల్లిదండ్రుల పాత్ర ఎంతగానో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే,సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ట్రైన్ కలెక్టర్ వరప్రసాద్ , స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, వెంకటేశ్, సౌమ్య, మహేశ్, జిల్లా విద్యాధికారి కే.ప్రశాంత్ రెడ్డి, ఏఏపిసి చైర్‌పర్సన్ కవిత, కార్పోరేటర్ జనగ్ రెడ్డి, కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: సిపి

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆదేశాలమేరకు రాష్ట్రవ్యాప్తంగా యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్ కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ రూరల్ మండలం దుర్శెడ్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాదక ద్రవ్యాల దుర్వినియోగంకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కరీంనగర్ లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ ఈ అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా జరుపుతున్నట్లు సీపీ తెలిపారు. భవిష్యత్ లో యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా రక్షించేందుకు పోలీస్ శాఖ నిరంతరం అవసరమైన చర్యలు చేపడుతుందని పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, యాంటీ నార్కోటిక్ యూనిట్ ఇన్స్పెక్టర్ రఫీక్ ఖాన్, కార్పోరేటర్ రవీందర్, ఎస్సై లక్ష్మారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## రజక కార్పోరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపిన నాగరాజు

**ప్రజాపక్షం / జమ్మికుంట :**తెలంగాణ రాష్ట్ర రజక (వాషర్‌మెన్) కోఆపరేటివ్ కార్పోరేషన్ చైర్మన్ డా.దాసరి రాజు అజయ్ కుమార్‌ను కరీంనగర్ జిల్లా యూత్ జనరల్ సెక్రటరీ పర్లపెల్లి నాగరాజు బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో నాగరాజు మాట్లాడుతూ ఎన్ఎస్‌యుఐ కార్యకర్తగా ప్రస్థానం మొదలుపెట్టి రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో పని చేసిన పనితీరును గుర్తించి సీఎం రేవంత్ రెడ్డి అజయ్‌కి ఈ బాధ్యతలు అప్పగించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రజక సంక్షేమం కోసం వారి అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్రవ్యాప్తంగా రజకవర్గాల సంక్షేమానికి ఆయన మరింత కృషి చేసి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివిస్తాం



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండలంలోని , కుస్తాపూర్ గ్రామలలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, విడిసి సభ్యులు, గ్రామస్తులు సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ పాఠశాలలోనే తమ పిల్లలను చదివిస్తామంటూ తీర్మానించారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చేర్పించొద్దని తమ గ్రామంలోకి ప్రైవేట్ పాఠశాలల బస్సులు రావద్దని,వస్తే అడ్డుకుంటామని తీర్మానించుకున్నారు.కాగా కుస్తాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రైవేట్ పాఠశాల బస్సులు రాకుండా విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలో చదవకుండా కమిటీని ఏర్పాటు చేసుకుని అధ్యక్ష ,ఉపాధ్యక్షులను నియమించారు.సర్పంచ్ జెల్ల రాజేశ్వర్,ఉప సర్పంచ్ సరికేల మహిపాల్,పంచాయతీ పాలకవర్గ ,గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు,మహిళలు తదితరులు ఉన్నారు.

# వీధి వ్యాపారుల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక



**ప్రజాపక్షం/కరీంనగర్:** వీధి వ్యాపారుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని వీధి వ్యాపారులకు పిలుపునిచ్చారు. కరీంనగర్ కళాభారతిలో బుధవారం సాయంత్రం నిర్వహించిన స్వనిధి మహోత్సవం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, నగర మేయర్ కోలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, మెప్మా పీడీ స్వరూప రాణి, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, వీధి వ్యాపారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కరీంనగర్‌లో స్ట్రీట్ వెండర్ కల్చర్‌ను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వీధి వ్యాపారుల సమస్యలు, అవసరాలు, అభివృద్ధి అవకాశాలపై చర్చించేందుకు త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్‌ను ఆదేశించారు. వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి జిల్లా యంత్రాంగం, మున్సిపల్ యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ పీఎం స్వనిధి పథకం ద్వారా లభిస్తున్న అవకాశాలను వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, మహిళా వ్యాపారులు మరింతగా అభివృద్ధి చెందేందుకు నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పీఎం స్వనిధి పథకం అమలులో ముందంజలో ఉందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. వ్యాపారులకు క్రెడిట్ సదుపాయాలు, ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పీఎం స్వనిధి పథకం కింద మంజూరైన రూ.50 లక్షల విలువైన చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం పలువురు వీధి వ్యాపారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

## నూతన హెలిప్యాడ్ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** కరీంనగర్ కలెక్టరేట్ లో నూతన హెలిప్యాడ్ పనులకు బుధవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. రూ.2 కోట్ల సుడా నిధులతో చేపడుతున్న ఈ పనులలో భాగంగా కలెక్టరేట్ వెనుక గల పాత హెలిప్యాడ్ పార్కులో నూతన హెలిప్యాడ్, కలెక్టరేట్ ఉత్తరం వైపు సీసీ రోడ్డు నిర్మాణం, పార్కులు తదితర పనులు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితోపాటు ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నగర మేయర్ కోలగాని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, బిఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్లా హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రోగ్రాంను ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** సర్ ప్రోగ్రాంను ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలని ఎల్లారెడ్డిపేట మండల తహసీల్దార్ సుజాత పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మీడియా ద్వారా ప్రకటన విడుదల చేశారు. సర్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 వ తేది నుండి మొదటి వారంలో లో గా బీఎల్ఓ లు క్షేత్ర స్థాయిలో ఇంటికి వచ్చి నేరుగా ఓటర్ కి ఎన్యూమరేషన్ ఫామ్స్ పంపిణీ చేయడం జరుగుతుందని, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో ప్రింట్ తీయించి సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా బిఎల్ఓలు ఇచ్చిన ఫామ్‌లో వివరాలు నింపి వచ్చే నెల 24 తేదీ లోగా తిరిగి బిఎల్ఓకు ఇవ్వాలని కోరారు. ఈ ప్రోగ్రాం వలన అర్హులైన ఏ ఒక్కరి ఓటు తీసివేయబడదని ఇది కేవలం అనర్హుల ఓట్లు అనగా పర్మనెంట్ షిఫ్ట్, డెత్, డబుల్ ఓట్లు తొలగించడం కోసమే అనే విషయాన్ని ప్రతి ఓటర్ గమనించాలని పేర్కొన్నారు. అలాగే 01.07.1987 కి ముందు జన్మించిన వారు ఎలక్షన్ కమిషన్ వారు కోరిన విధంగా 11 రకాల ప్రూఫ్‌ల లో ఓటర్ యొక్క ఏదైన ఒక ప్రూఫ్, 01.07.1987 నుండి 02.12.2004 మధ్యలో జన్మించిన వారు వారి ప్రూఫ్ తో పాటు తల్లి దండ్రుల లో ఎవరిదైనా ఒక ప్రూఫ్, 02.12.2004 తర్వాత జన్మించిన వారు వారి ప్రూఫ్‌తో పాటు వారి తల్లిదండ్రుల ప్రూఫ్ కూడా చూపించాలని తెలిపారు.

## రోడ్లపై వరద నీరు నిల్వకుండా ముందస్తు చర్యలు

### డ్రైనేజీ వ్యవస్థ నాళాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, నగరపాలక సంస్థ కమిషనర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** వర్షాకాలం నేపథ్యంలో నగరంలో రోడ్లపై వరద నీరు నిల్వకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కరీంనగర్ నగరంలోని రాంనగర్, రేకుర్తి, మంచిర్యాల చౌరస్తా, కలెక్టరేట్ సమీపంలోని ప్రధాన డ్రైనేజీ వ్యవస్థ నాలాలను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో వరద నీరు రోడ్లపైకి రాకుండా చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. డ్రైనేజీలు, నాలాల్లో వర్షపు నీరు నిరంతరాయంగా ప్రవహించేలా తక్షణ చర్యలు చేపట్టాలని, ఎక్కడా మురుగు లేదా వర్షపు నీరు నిల్వ కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.నగరంలోని కీలక జంక్షన్ల వద్ద నీరు నిల్వ కాకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాల్సిన అవసరంపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, నగరపాలక సంస్థ కమిషనర్ చర్చించారు.

## మద్యపానం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

### కలెక్టర్, పోలీస్ కమిషనర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** మద్యపానం, మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా మానుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సూచించారు. కరీంనగర్ నగరంలోని అశోక్‌నగర్‌లో ఉన్న మాదకద్రవ్యాల, మద్యపాన వ్యసన విముక్తి కేంద్రాన్ని బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్వహణ, బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, పునరావాస కార్యక్రమాలపై ఆరా తీశారు. కేంద్రంలో చికిత్స పొందుతున్న బాధితులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు, చికిత్స పురోగతిని తెలుసుకున్నారు. వైద్యుల సూచనల మేరకు చికిత్సను పూర్తిగా కొనసాగించి మద్యపానం, మాదకద్రవ్యాల వినియోగాన్ని శాశ్వతంగా మానుకోవాలని సూచించారు. మద్యం, మాదకద్రవ్యాల వ్యసనాల వల్ల వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని పేర్కొన్నారు. వ్యసనాలకు దూరంగా ఉంటేనే మంచి ఆరోగ్యం, ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని, కుటుంబ సభ్యుల ఆశలను నెరవేర్చే దిశగా ముందుకు సాగాలని బాధితులకు ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ అధికారి సరస్వతి, నాగేశ్వరరావు, కేంద్ర నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యశోదలో జీర్ణాశయ శస్త్ర చికిత్సల్లో ఆధునిక సాంకేతికలు

### సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డా.ప్రసాద్ బాబు

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** జీర్ణాశయ వ్యాధుల చికిత్సలో ఆధునిక సాంకేతికలు విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డా.ప్రసాద్ బాబు అన్నారు. లాపరోస్కోపిక్ , రోబోటిక్ శస్త్ర చికిత్సల ద్వారా రోగులకు మరింత సురక్షితమైన ఖచ్చితమైన వేగవంతమైన చికిత్స అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. బుధవారం నగరంలోని యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పెద్ద కోతలతో నిర్వహించే సంప్రదాయ శస్త్ర చికిత్సలకు బదులుగా ప్రస్తుతం మినిమల్లి ఇన్వేసివ్ (చిన్న రంధ్రాల) విధానాలు అందుబాటులోకి రావడంతో రోగులు వేగంగా కోలుకుంటున్నారని అన్నారు. అన్నవాహిక,కడుపు, కాలేయం, క్లోమగ్రంధి, పిత్తాశయం, పెద్దపేగు, పురీషనాళ క్యాన్సర్లు, సంక్లిష్ట హెర్నియాలు, స్థూలకాయం, రిఫ్లక్స్ వ్యాధుల చికిత్సల్లో ఈ సాంకేతికతలు విశేష ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. లాపరోస్కోపిక్ విధానంలో హైడెఫినిషన్ కెమెరాల సహాయంతో ఆపరేషన్ నిర్వహిస్తారని దీనివల్ల నొప్పి, రక్తస్రావం, ఇన్ఫెక్షన్ ప్రమాదం తగ్గడంతోపాటు ఆసుపత్రిలో తక్కువ రోజులు ఉంటే సరిపోతుందన్నారు. రోబోటిక్ శస్త్ర చికిత్స ద్వారా త్రిమితీయ (3డీ) దృశ్యాలు అత్యంత సూక్ష్మ కదలికల నియంత్రణ వీలవుతుందని తెలిపారు. జీర్ణాశయ సమస్యలను ముందుగానే గుర్తించి నిపుణులను సంప్రదిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. డాక్టర్ జయదీప్ మాట్లాడుతూ కొందరికి జీవనశైలి మార్పులవల్ల ఉబకాయం తగ్గించుకోవచ్చని అన్నారు. మరి కొందరికి సర్జరీ తప్పనిసరి అని ఆ సర్జరీ ఇప్పుడు ఆధునికతతో ఏలాంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా చికిత్స అందుబాటులోకి వచ్చిందన్నారు. ఊబకాయం వల్ల ఇతర అవయవాలపై ప్రభావం పడుతుందని కావున వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ హెడ్ నరేంద్ర మోరా, శ్రీకాంత్, మహేందర్ పాల్గొన్నారు.

## సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయం

**ప్రజాపక్షం/ధర్మపురి :** పేద ప్రజల సొంత ఇంటి కల సాకారం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి అన్నారు. ధర్మపురి మున్సిపాలిటీ పరిధిలోని 13 వార్డుకు చెందిన బండారి శంకర్ దీప దంపతుల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి నాగలక్ష్మి,13వ వార్డు కౌన్సిలర్ చీపిరిశెట్టి రాజేష్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన గృహంలో అడుగిడిన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆయిల్‌పామ్ తోటలు పెట్టండి

### నెల నెలా జీతం లాగా ఆదాయం పొందండి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** రైతులు సాంప్రదాయ పంటలతో పాటు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే ఆయిల్‌పామ్ సాగును విస్తృతంగా చేపట్టాలని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సూచించారు.ఆయిల్‌పామ్ ఒక వాణిజ్య పంటగా రైతులకు దీర్ఘకాలం పాటు నెల నెలా జీతం మాదిరిగా ఆదాయాన్ని అందించే విశిష్టత కలిగి ఉందని తెలిపారు.ఆయిల్ పామ్ తోటలు నాటిన తర్వాత సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాలుగో సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమవుతుంది. అనంతరం ప్రతి నెలా తాజా పండ్ల గుత్తులు (ఎఫ్ఎఫ్‌బిఎస్) కోతకు రావడంతో రైతులకు నిరంతర ఆదాయం లభిస్తుంది. మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గుల ప్రభావం తక్కువగా ఉండటంతో పాటు ప్రభుత్వం మరియు ఆయిల్‌పామ్ కంపెనీల సహకారంతో పంటకు భరోసా లభిస్తుందని వివరించారు.ఇటీవల నిర్వహించిన ఆయిల్‌పామ్ శిక్షణ కార్యక్రమాల్లో రైతులకు మొక్కల నాటకం, ఎరువుల యాజమాన్యం, నీటి నిర్వహణ, పురుగులు మరియు వ్యాధుల నివారణ, కోత అనంతర నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే కూరగాయల సాగు, పంటల వైవిధ్యీకరణ ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలపై కూడా రైతులకు సూచనలు అందించారు.రైతులు ఆయిల్‌పామ్ సాగును స్వీకరించి దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని పొందాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి తెలిపారు.

## డిప్యూటేషన్‌పై డిప్యూటీ తహసీల్దార్ బదిలీ

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ (డిటి) షఫీ మహమ్మద్ బదిలీ అయ్యారు.ఆయనను ప్రభుత్వం డిప్యూటేషన్‌పై ఓదెల మండలానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.అదేవిధంగా, ప్రస్తుతం ఓదెల మండలంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మహేష్ కుమార్ ముత్తారం మండలానికి బదిలీపై రానున్నారు.త్వరలోనే వీరిద్దరూ ఆయా కార్యాలయల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

## మృతుడి కుటుంబానికి ఎమ్మెల్సీ రమణ పరామర్శ

**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు మరియు సీనియర్ నాయకులు ఏనుగందుల లింగం గౌడ్ ఇటీవల గుండెపోటుతో మరణించగా బుధవారం వారి కుటుంబాన్ని ఎమ్మెల్సీ ఎల్ రమణ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఆయన రాయికల్ మున్సిపల్ చైర్మన్ కటుకం రవీందర్, వైస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి,రాయికల్ మండల & పట్టణ అధ్యక్షులు బర్కం మల్లేష్ ,ఎలగేటి అనిల్,కౌన్సిలర్లు కోరుకంటి రాము, తోట హరీష్, నాయకులు మర్రిపెల్లి నారాయణ గౌడ్, కోయ్యాడి మహిపాల్,రుక్కు భాయ్,వొళ్ళాల గంగాధర్, స్వామిరెడ్డి,పులి మల్లేశం గౌడ్, బి.ఆర్ .యస్ నాయకులు పాల్గొన్నారు.

# వేధింపుల రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం




**ప్రజాపక్షం/మందమర్రి:** మహిళల భద్రత, గౌరవ పరిరక్షణ కోసం షీ టీంలు నిరంతరం పనిచేస్తున్నాయని, వేధింపుల రహిత సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని షీటీం ఎస్ఐ ఉషారాణి పేర్కొన్నారు. బుధవారం మందమర్రి మండల సమాఖ్య కార్యాలయంలో ఉద్యోగుల కోసం నిర్వహించిన మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఉషారాణి మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరిగే వేధింపులు, ఈవ్ టీజింగ్, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ వేధింపులు వంటి ఘటనలను అరికట్టేందుకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆమె పేర్కొన్నారు. మహిళలు తమపై ఎలాంటి వేధింపులు జరిగినా భయపడకుండా వెంటనే పోలీసులను లేదా షీ టీంను సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, బాధితులకు అన్ని విధాలా రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా విద్యార్థినీలు, ఉద్యోగినీలు, గృహిణులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా వేదికల్లో వ్యక్తిగత వివరాలను పంచుకునే విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన టీ సేఫ్ యాప్ వినియోగంపై వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ యాప్ ద్వారా పోలీసులకు తక్షణ సమాచారం అందించి సహాయం పొందవచ్చని తెలిపారు. షీ టీంల విధులు, మహిళలకు అందిస్తున్న సేవలు, చట్టపరమైన రక్షణల గురించి ఉద్యోగులకు విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల ప్రాంగణంలో పందుల స్వైర విహారం

**ప్రజాపక్షం/పెంచికలపేట్ :** పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం పందులు, పశువుల సంచారానికి కేంద్రంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులు విద్యాభ్యాసం చేయాల్సిన పాఠశాల ఆవరణలో పందులు స్వైర విహారం చేస్తుండగా, క్రీడా మైదానంలో పశువులు సంచరిస్తూ తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నాయని మండిపడుతున్నారు. పాఠశాలకు రెండు వైపులా గేట్లు ఉన్నప్పటికీ పందులు, పశువులు యథేచ్ఛగా లోనికి ప్రవేశిస్తున్నాయని, దీనిపై పాఠశాల యాజమాన్యం, సిబ్బంది నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.పాఠశాలకు హాజరవుతుండగా, ప్రాంగణం అపరిశుభ్రంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమైన ప్రస్తుత పరిస్థితుల్లో పందుల సంచారం కారణంగా అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, కనీస జాగ్రత్తలు తీసుకోవాల్సిన అధికారులు, పాఠశాల సిబ్బంది సమస్యను పట్టించుకోకపోవడం బాధ్యతారాహిత్యమని పేర్కొంటున్నారు.

# మొక్కలు నాటడం, రక్తదానం సమాజానికి ఆదర్శం

## మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు



**ప్రజాపక్షం/మందమర్రి:** పర్యావరణ పరిరక్షణతో పాటు మానవ సేవను ప్రోత్సహించడం అభినందనీయమని మందమర్రి మున్సిపాలిటీ కమిషనర్ తుంగపిండి రాజలింగు అన్నారు. అదాని సంస్థ ఆధ్వర్యంలో టోల్ గేట్ సమీపంలో మొక్కలు నాటడం, స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడంలో మొక్కల పెంపకం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే పచ్చదనాన్ని పెంపొందించడం అత్యవసరమని పేర్కొన్నారు. రక్తదానం మహాదానమని, ఒకరి రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడగలదని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సహాయపడేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావడం ఆదర్శప్రాయమని కొనియాడారు. పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవ అనే రెండు గొప్ప లక్ష్యాలను ఒకే వేదికపై సమన్వయం చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ సునీల్ వానిస్, ఎన్ హెచ్ ఎఐ డిప్యూటీ మేనేజర్ సౌరబ్ రంజన్, రెసిడెంట్ ఇంజనీర్ మహేష్, హార్టికల్చర్ నిపుణులు తిరుపతి, అదాని సంస్థ ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలి

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్



**ప్రజాపక్షం/మందమర్రి :** ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ పిలుపునిచ్చారు. బుధవారం మందమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన, ఈ నెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమం అమలులో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఐదేళ్లలోపు 76,367 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం 459 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయగా, 1,836 మంది సిబ్బంది సేవలు అందించనున్నారని వెల్లడించారు. ప్రతి చిన్నారి వరకు చేరుకుని చుక్కలు వేయడం ద్వారా కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయాలని ఆదేశించారు. పోలియో నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి చుక్కలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ లక్ష్యం ప్రతి చిన్నారిని పోలియో మహమ్మారి నుంచి రక్షించడమేనని, ఆరోగ్యవంతమైన భావితరాల కోసం అందరూ సహకరించాలని కోరారు. ప్రతి చిన్నారికి రెండు చుక్కలు, పోలియోకు శాశ్వత చెక్ అనే నినాదంతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమం విజయవంతానికి వైద్య, ఆరోగ్య, ఐసిడిఎస్, విద్యాశాఖలతో పాటు అన్ని విభాగాలు సమిష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు.

# బంబార గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



**ప్రజాపక్షం/వాంకిడి :** వాంకిడి మండలంలోని బంబార గ్రామానికి చెందిన బోయిరే సుజాత, లక్ష్మణ్ దంపతుల నూతన ఇంద్రమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం గ్రామస్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించబడింది. సాంప్రదాయ పద్ధతుల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించి, వేద మంత్రోచ్చారణల నడుమ గృహప్రవేశ వేడుకను వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుర్నులే నారాయణ హాజరై కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఇంటిలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. సొంత ఇంటి కల నెరవేరడం ప్రతి కుటుంబ జీవితంలో ఒక ప్రత్యేకమైన ఘట్టమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సొంత ఇంటి కల సాకారం అవుతుండటం ఆనందకరమైన విషయమని తెలిపారు. ఇంద్రమ్మ ఇళ్ల వంటి పథకాలు సామాన్య ప్రజలకు గొప్ప వరంగా నిలుస్తున్నాయని అభిప్రాయపడ్డారు. అనంతరం కొత్త ఇంటిలో కుటుంబ సభ్యులు ఎల్లప్పుడూ సుఖశాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ సర్పంచ్ బెండారే కృష్ణాజీ, ఉప సర్పంచ్ జాడే సంతోష్, సెండే అన్నాజీ, ఉప్పుల కృష్ణ, జాడి ప్రభాకర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బారెగూడలో వైభవంగా పీరీల ఊరేగింపు

**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ మండలం బారెగూడ గ్రామంలో మొహర్రం సందర్భంగా బుధవారం పీరీల ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. బారెగూడ గ్రామంలోని హుస్సేన్ ఆశుర్ ఖానాలో నిర్వహిస్తున్న మొహర్రం ఉత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగాయి. డప్పు వాయిద్యాల మోత, సవారీ నృత్యాల మధ్య పీరీలను గ్రామ వీధుల గుండా ఊరేగించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు ప్రతి ఏడాది భక్తులను విశేషంగా ఆకర్షిస్తాయని తెలిపారు. ఆశుర్ ఖానా వద్ద భక్తులు మొక్కులు చెల్లించుకొని ప్రార్థనలు నిర్వహించారని, గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పీరీలను దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారని పేర్కొన్నారు. గురువారం జరిగే పెద్ద సరిగెత్తు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని, భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణ స్థల పరిశీలన



**ప్రజాపక్షం/నేరడిగొండ:** నేరడిగొండ మండలంలోని కడెం వాగుపై నిర్మించ తలపెట్టిన లిఫ్ట్ ఇరిగేషన్ స్థలాన్ని నీటి పారుదల శాఖ డీఈ భీంరావు ఆధ్వర్యంలోని బృందం బుధవారం వెంకటాపూర్ శివారంలో పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే పూర్తి అయితే త్వరలోనే లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ప్రారంభించే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. ఈ నిర్మాణ స్థల పరిశీలన కార్యక్రమంలో ఆయనతో పాటు ఇరిగేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లు ప్రత్యేక గణన ఫారాలు పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఓటరు తమ కుటుంబ సభ్యుల వివరాలను ప్రత్యేక గణన ఫారంలో పూర్తిగా, ఖచ్చితంగా నమోదు చేసి సంబంధిత బిఎల్ఓకు అందజేయాలని కాగజ్ నగర్ తహసీల్దార్, సహాయ ఓటరు నమోదు అధికారి మధుకర్ తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక గణన ఫారాలను పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక సవరణ ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఫారం సమర్పించిన అనంతరం బిఎల్ఓ నుంచి రిసీవ్డ్ కాపీ తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఫారంలో అసంపూర్ణ సమాచారం నమోదు చేయడం, తప్పులు చేయడం లేదా ఫారాన్ని సమర్పించకపోవడం వల్ల ఓటరు వివరాల పరిశీలనలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని చెప్పారు. అందువల్ల ఓటర్లందరూ నిర్లక్ష్యం చేయకుండా పూర్తి వివరాలతో ఫారాలను నింపి నిర్ణీత గడువులోగా బిఎల్ఓలకు అందజేయాలని కోరారు. ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఓటర్లందరూ ఈ ప్రత్యేక సవరణ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా సామూహిక షష్టిపూర్తి మహోత్సవం

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** మంచిర్యాల గోదావరినది తీరంలోని శ్రీ గౌతమేశ్వర రమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయంలో వాసవిక్లబ్స్ ఆధ్వర్యంలో అర్చకులు బ్రహ్మశ్రీ గడియారం బాలాజీ శర్మ పర్యవేక్షణలో సామూహిక షష్టిపూర్తి మహోత్సవాన్ని బుధవారం వైభవోపేతంగా నిర్వహించారు. గౌతమేశ్వర రమాసహిత సత్యనారాయణ స్వామి సన్నిధిలో ఐదు జంటలతో మూడు రోజుల పాటు నిర్వహించే సామూహిక ఉగ్రరథ షష్టిపూర్తి మహోత్సవంలో మొదటి రోజు గణపతిపూజ, నవగ్రహ పూజ, కళశాల మండప స్థాపన, ముథిక స్నానాలు, శాంతిపూజ తదితర పూజాధి కార్యక్రమాలను నిర్వహించారు. గురువారం మహన్యాసపూజ, చండీ హోమం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తు శుక్రవారం మూడవ రోజు పూర్ణాహుతి, ఆశీర్వచన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ నిర్వాహకురాలు గోపగాని శ్రీదేవి, వాసవిక్లబ్ జిల్లా క్యాబినెట్ సెక్రటరి సెవ కేశెట్టి వంశీకృష్ణ, క్యాబినెట్ కార్యదర్శి కొంకుముట్టి వెంకటేశ్, పిఆర్ఓ వుత్తూరి రమేష్, జోన్ ఛైర్మన్లు పడకంటి శ్రీనివాస్, ఇరుకుల్ల సూర్యనారాయణ, వేంపల్లి వనిత క్లబ్ అధ్యక్షురాలు పడకంటి రజిత, కార్యదర్శి కుక్కుడపు గాయత్రి, నస్పూర్ మండల్ వాసవిక్లబ్ కోశాధికారి చందూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పిప్రీ గ్రామానికి రూ. 30 లక్షల నిధులు మంజూరు



**ప్రజాపక్షం / లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని పిప్రీ గ్రామానికి ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ రూ. 30 లక్షల గోదాం నిర్మాణ పనుల కోసం మంజూరు పత్రాన్ని అందజేశారు. గోదాం నిర్మాణం పూర్తయితే రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను భద్రంగా నిల్వ చేసుకునే సౌకర్యం కలుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. సర్పంచ్ అనిత అశోక్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## మంకీ రెస్క్యూ సెంటర్‌ను పశీలించిన జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం సారంగాపూర్ మండలంలోని చించోలి బి, గ్రామంలోని గండి రామన్న హరితవనంలో గల మంకీ రెస్క్యూ సెంటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోతుల పట్టివేతకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారి ఇలంబర్తికి స్వాగతం పలికిన కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కమీక్ష కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన ప్రత్యేక అధికారి ఇలంబర్తిని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం అటవీ శాఖ వసతి గృహంలో పూల మొక్కను అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. డి.ఎఫ్.ఓ. సుశాంత్ సుఖదేవ్, బోబడే, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, తదితరులు పాల్గొనారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

**ప్రజాపక్షం / ముథోల్ :** గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని మండలంలోని ఆస్టా గ్రామ సర్పంచ్ లావణ్య శ్రీనివాస్ అన్నారు. బుదవరారం మండలంఓని ఆస్టా గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నధుల ద్వారా రూ. 5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సంధ్బంగా వారు మాట్లాడుతూ, తాము ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు.

# భావి తరాలకు పచ్చని ప్రకృతిని అందిద్దాం



**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** భావి తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ కొత్తపల్లి అనిత అన్నారు. కాగజ్ నగర్ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో గరీబ్ నవాజ్ రిలీఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహమ్మద్ ఆరిఫ్ అత్తారీ నిర్వహణలో బుధవారం పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ కొత్తపల్లి అనిత, మున్సిపల్ కమిషనర్ బి తిరుపతి, మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవడం కేవలం కొందరిని బాధ్యత కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కల పెంపకం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. చెట్లు పెరిగితేనే స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన వాతావరణం, ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని అన్నారు. భావి తరాలకు మనం అందించే అత్యంత విలువైన సంపద పచ్చని ప్రకృతి, పరిశుభ్రమైన పర్యావరణమేనని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ మొక్కల నాటే కార్యక్రమాలను నిర్వహిస్తున్న గరీబ్ నవాజ్ రిలీఫ్ ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో పర్యావరణ స్పృహను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, గరీబ్ నవాజ్ రిలీఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా పారిశుధ్య పనులు

**ప్రజాపక్షం/వాంకిడి :** వాంకిడి మండల కేంద్రంలో వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులను అధికారులు ముమ్మరం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇందిరానగర్ కాలనీ, పాత పోస్టాఫీస్ కాలనీతో పాటు పలు కాలనీల్లోని మురుగుకాల్వల్లో పేరుకుపోయిన మురుగును, చెత్తను కార్మికుల సహాయంతో తొలగించి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ఈ సందర్భంగా వాంకిడి సర్పంచ్ సతీష్ సోను మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామపంచాయతీ తరఫున ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కాల్వల్లో మురుగు పేరుకుపోవడం వల్ల నీటి నిల్వలు ఏర్పడి దోమలు, వ్యాధులు వ్యాపించే అవకాశం ఉండటంతో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో పరిశుభ్ర వాతావరణాన్ని నెలకొల్పేందుకు నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, మురుగునీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతే ప్రధాన ఆయుధమని, ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా గ్రామపంచాయతీ సిబ్బందికి సహకరించి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, కార్మికులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎరువుల వ్యాపారుల ఇష్టారాజ్యం.. ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు విక్రయం

### సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దినకర్

**ప్రజాపక్షం/వాంకిడి:** వాంకిడి మండలంలో కొందరు ఎరువుల వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమై సాగు పనులు వేగంగా సాగుతున్న తరుణంలో, ఎరువులకు ఉన్న డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్‌పి ధరలకే ఎరువులు విక్రయించాల్సి ఉండగా, కొందరు వ్యాపారులు లూటీకి తెరలేపారు. రైతుల అత్యవసర అవసరాలను పెట్టుబడిగా మార్చుకుంటూ బస్తాకు వందల రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. విత్తనాలు వేసే సమయం కావడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో అడిగినంత చెల్లించి ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో సాగు పెట్టుబడి వ్యయం పెరిగి రైతాంగంపై తీవ్ర అదనపు ఆర్థిక భారం పడుతోంది. మండలంలో యథేచ్ఛగా నడుస్తున్న ఈ దందాపై సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు కనీసం తనిఖీలు కూడా చేపట్టకపోవడం గమనార్హం.



అధికారుల నిర్లక్ష్యం డీలర్లకు వరం : సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్

మండలంలో అధికారుల నిర్లక్ష్యం వల్లే ఎరువుల వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను పీల్చి పిప్పి చేస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# నూతన ఎస్ఐగా కొమరయ్య బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/జైనూర్ :** ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ యు మండల పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఐగా కొమరయ్య బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలి బదిలీల్లో భాగంగా ఇక్కడికి నియమితులైన ఆయన పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా బాధ్యతలను చేపట్టారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలకు, పోలీసులకు మధ్య సత్సంబంధాలు ఉండేలా చూస్తామని, స్థానిక ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. మండల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచుతామని తెలిపారు.

## నూతన ఎంపిడిఒగా రవీందర్ బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/జైనూర్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ యు మండల నూతన ఎంపిడిఒగా రవీందర్ బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయానికి చేరుకున్న ఆయనకు మండల పరిషత్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిరుపేదలకు, అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతానని పేర్కొన్నారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు జవాబుదారీగా సేవలందించాలని సూచించారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు, సూపరింటెండెంట్, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన రాం కిషన్‌రెడ్డి



**ప్రజాపక్షం / సారంగాపూర్ :** మండలంలోని ప్యారామూర్, వైకుంటాపూర్ గ్రామాలలో ఇటీవల మరణించిన బాధిత కుటుంబాలను బుధవారం బి.ఆర్.ఎస్. నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి రాం కిషన్ రెడ్డి పరామర్శించారు. కాల్వ బీరవెల్లి మధ్యలో ఇటీవల జరిగిన ఆటో బైక్ ప్రమాదంలో మృతి చెందిన సుంకరి వసంత కుటుంబాన్ని పరామర్శించి అనంతరం వైకుంటాపూర్‌లోని దుబాయిలో రోడ్డు ప్రమాదంలో మరణంచిన లగ్గం జగదీష్ కుటుంబాన్ని అన్నారోగ్యాలతో మరణించిన ఏరిండ్ల చిన్నయ్య, మర్రి లస్మవ్వ కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మరణించిన కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సారంగాపూర్ మండల కన్వీనర్ దేవి శంకర్, లక్ష్మణచాంద మండల కన్వీనర్ కృష్ణారెడ్డి నిర్మల్ మండల కన్వీనర్ మహేష్ రెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ గౌడ్ మోతే వారి లక్ష్మణ్, ప్యారామూర్ రవి, లక్ష్మణ్, నరేష్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతులు సన్నరకం వరి సాగు చేయాలి

**ప్రజాపక్షం / దిలావర్‌పూర్ :** మండలంలోని గుండంపల్లి రైతు వేధికలో విత్తన మేల కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రమణారెడ్డి ప్రారంభించడం జరిగింది. ప్రభుత్వం నిర్దేశించిన 7 సన్న రకాల వడ్ల లో నాలుగు రకాలు స్వల్ప కాలిక మూడు దీర్ఘకాలిక రకాలైన కంది సోయాబీన్ కూరగాయ విత్తనాలు మరియు ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్‌ఫాం ప్రదర్శించడం రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. పలువురు మాట్లాడుతూ, రైతులు వానాకాలం వరి సాగుకు 7 సన్న రకాలను బోనస్ అందించడం జరగుతుందని రైతులు సన్న రకం వడ్లను సాగు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రాజశేఖర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ దేంఎదర్ రెడ్డి వ్యవసాయ విస్తరణాధికారి జైపాల్, విత్తన్న డీలర్లు మరియు రైతులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ పోటీలు



**ప్రజాపక్షం/బోధన్:** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో భాగంగా నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం కల్దుర్కి జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు బుధవారం వ్యాస రచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక నష్టాలపై వివరించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందచేయనున్నట్లు వారు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీస్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అమ్మవార్ల గద్దెలను అదనంగా నిర్మించేందుకు కసరత్తు

### ఊర పండగ అమ్మవార్ల గద్దెలను పరిశీలించిన ఎమ్మెల్యే ధన్‌పాల్



**ప్రజాపక్షం,/నిజామాబాద్ :** అమ్మవార్ల గద్దెలు భక్తులకు దూరం నుంచి కనిపించేలా అదనంగా నిర్మించేందుకు కసరత్తు చేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆషాఢ మాసంలో ఘనంగా నిర్వహించే ఊర పండగ అమ్మవార్ల గద్దెను భక్తుల సౌకర్యార్థం మార్పులు చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం సర్వసమాజ్ కమిటీ పెద్దలతో కలిసి నగరంలోని ఖిల్లా ప్రాంగణంలోని గద్దెలను పరిశీలించి ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో రాజేశ్వర్, గంగాధర్, మహేందర్, కిరణ్, లక్ష్మీనారాయణ, నర్సయ్య, రవీందర్, రాజేందర్, లింబాద్రి, సంతోష్, సాయినాథ్, జితేందర్, లక్ష్మీనారాయణ,ప్రవీన్, జ్యోతి, మురళి, చిరంజీవి, బాలకిషన్ పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ మార్కర్ పెన్నుల వితరణ

**ప్రజాపక్షం, నిజామాబాద్ :** ఇలాల వైద్యారోగ్య శాఖకు రెడ్‌క్రాస్ మార్కర్ పెన్నుల వితరణ చేసినటు రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు తెలిపారు. జూన్ 28న నిర్వహించనున్న జాతీయ పోలియో దినోత్సవ కార్యకర్రమంలో భాగంగా చిన్నారులకు పోలియో చుక్కల మందుల వేసిన తర్వాత మార్కింగ్ పెన్నులను రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ రాజశ్రీ అందజేశారు. కార్యక్రమంలో ఎఓ సుమంత్‌కుమార్, తోట రాజశేఖర్, రవీందర్, వెంకటేశ్వర్లు, సుధాకర్ పాల్గొన్నారు.

# రైతుల పక్షాన పోరాడుతున్న మాజీ మంత్రి వేములను గృహనిర్బంధం చేయటం దుర్మార్గం

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల రైతులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొనడానికి వెళుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేములప్రశాంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గృహనిర్బంధం చేయటం అత్యంత ఖండనీయమని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పూర్ణానందం అన్నారు. రైతుల సమస్యలపై పోరాడేందుకు తాడ్వాయి మండల రైతులకు సంఘీభావం తెలిపేందుకు వెళుతున్న ప్రజాప్రతినిధిని అడ్డుకోవటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. యూరియా యాప్ కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎరువుల కోసం రైతులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. అందువల్ల యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేసి గతంలో అమలులో ఉన్న పాత పద్ధతిలోనే యూరియా పంపిణీ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా వారి



పక్షాన నిలిచే నాయకులను గృహనిర్బంధం చేయడం సరైన విధానం కాదని, ప్రభుత్వం రైతుల ఆందోళనలను గౌరవించి తక్షణమే యూరియా యాప్‌ను రద్దు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పూర్ణానందం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉపేందర్‌రెడ్డి,బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుల్లె రాజేశ్వర్, జక్కని మధుసూదన్, తొలిప్రేకర్ శ్రీనివాస బద్దం ప్రభాకర్, సున్నపు అంజయ్య, గన్నవరం రాజేశ్వర్, అష్రఫ్, సాయన్న పాల్గొన్నారు.

## ఊర పండుగ అమ్మవార్ల గద్దె పరిశీలించిన ఎమ్మెల్యే ధన్‌పాల్

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్:** ఆషాడమాసంలో ఘనంగా నిర్వహించే ఊర పండుగ అమ్మవార్ల గద్దెను భక్తుల సౌకర్యార్థం మార్పులు, దేవుళ్ల విగ్రహాల పెంపు వంటి పనులు చేపట్టనున్నట్టు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. బుధవారం నగరంలోని ఖిల్లా ప్రాంగణంలో గల ఊర పండుగ దేవుళ్ల గద్దెలను సర్వసమాజ్ కమిటి పెద్దలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు దేవుళ్ల దూరం నుంచి కూడా కనపడేలా ఎత్తు పెంచుతున్నట్లు... అలాగే గద్దెను అదనంగా నిర్మించేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించి ఊరపండగకు సుందరంగా తీర్చిదిద్దుతామని అన్నారు. గద్దె వద్దకు ఇందూరు భక్తులు భారీగా తరలివస్తారని, ఇబ్బందులు కలగకుండా అదనపు నిర్మాణం చేపట్టాలని, అలాగే మొరంతో గద్దె చుట్టుపక్కల చదును చేయించాలన్నారు. అనంతరం సర్వసమాజ్ కమిటి పెద్దలు మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం ఆషాడ మాసం మూడో ఆదివారం ఊర పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. అయితే ఈసారి సంకటహర చతుర్థి రావడంతో ఆలోచిస్తు



న్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్వసమాజ్ కమిటి కార్యదర్శి బంటు రాజేశ్వర్, ఊర పండగ కన్వీనర్ రామర్తి గంగాధర్, స్తానిక కార్పొరేటర్ మల్కాయ్ మహేందర్, మున్నూరు కాపు సంఘం గాజుల పేట అధ్యక్షులు కొరడి కిరణ్, లక్ష్మి నారాయణ, కొరడి నడిపి నరసయ్య, మను బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు రవీందర్, రాజేందర్, లింబాద్రి, సంతోష్ సాయినాథ్, జితేందర్, బిజెపి కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మి నారాయణ, బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, కల్పే అర్చనా చిరంజీవి, మాజీ కార్పొరేటర్ బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లారం గండిలో దారుణహత్య

### కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం

**ప్రజాపక్షం,/నిజామాబాద్ :** నగర శివారులోని మల్లారం శివారులో ఒకరి దారుణహత్యకు గురయ్యాడు. ఈ సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. నగరంలోని శాంతినగర్‌కు చెందిన ఫరీద్‌బాబా తాయిత్తులు కట్టడం, చేతబడి గురైన వారిని సఫర్యాలు చేస్తాడని ప్రసిద్ధి. అదే మాదిరిగా గుప్త నిధుల తవ్వకాలకు సహకరిస్తాడనేది ప్రచారంలో ఉంది. కొన్ని రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన ఫరీదుబాబా తిరిగి రాలేదు. నిజామాబాద్ వర్ని రహదారిలోని మల్లారం గండిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమందించగా అక్కడ దొరికిన ఆనవాళ్లను బట్టి అతడిని ఫరీద్‌బాబాగా పోలీసులు నిర్ధారించారు. ఫరీద్‌బాబాను గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల అమావాస్య సమయంలో అటవీ ప్రాంతానికి రప్పించి హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరి పేర్లను ప్రస్తావించగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు రూరల్ ఎస్‌హెచ్ఓ శ్రీనివాస్ తెలిపారు.



## వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగొద్దు

**ప్రజాపక్షం,/కమ్మర్‌పల్లి :** మండల కేంద్రంలో ముందస్తు వరద నివారణ చర్యల్లో భాగంగా వరద కాలువ పూడికతీత పనులను ఉపసర్పంచ్ కొత్తపల్లి అశోక్ ప్రారంభించారు. గత యేడాది భారీ వర్షాలతో కాలనీలో వరద ఉధృతి పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సారి అలాంటి పరిస్థితి రాకుండా ముందస్తుగా జెసిబి యంత్రాలతో పూడుకుపోయిన వరద కాలువను శుభ్రం చేస్తున్నారు. రాబోయే వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామపంచాయతీ తరపున అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.

## పోలీస్ సిబ్బందికి రెయిన్‌కోట్లు అందజేత

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.ఎండనకా, వాననకా రాత్రింబవళ్లు కష్టపడి విధులు నిర్వహించే సిబ్బందికి అత్యవసర పరిస్థితుల్లో రెయిన్‌కోట్లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

## తినుబండారాల దుకాణదారులంతా తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి

### పట్టణంలోని మిఠాయి దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారి టీ. సునిత

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి సునీత పట్టణంలోని మిఠాయి దుకాణాలలో గడువు తీరిన మిఠాయిలు, చాక్లెట్లు, లేబుళ్ళు లేని ఆఆర పదార్థాలను గుర్తించారు. ఆయా మి ఠాయి దుకాణాలపై తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. దుకాణ దారులంతా ఆహార పదార్థాలకు సంబంధించి లేబుళ్ళు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆహార పదార్థాల గడువు ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ, గడువు తీరిన ఆహార పదార్థాలను దుకాణాల నుంచి తొలగించానలి తెలిపారు.



## దొన్కల్ లో ప్లాస్టిక్ నిషేధం

### పంచాయతీ పాలకవర్గం తీర్మానం



**ప్రజాపక్షం/మోర్తాడ్:** ప్లాస్టిక్ వద్దు స్టీల్ ముద్దు అని నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని దొన్కల్ గ్రామంలో ప్లాస్టిక్ నిషేదిద్దాం అని పంచాయతీ పాలకవర్గంలో బుధవారం తీర్మానం చేశారు. గ్రామంలో ఎవరూ కూడ ఎటువంటి శుభ కార్యాలు చేసిన ప్లాస్టిక్ పల్లెలు, గ్లాసులను వాడరాదని తీర్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామంలో ఏ శుభకార్యాలు జరిగిన ప్లాస్టిక్ పల్లెలు, ప్లాస్టిక్ గ్లాసులు వాడటం నిషేదిద్దాం అని పాలకవర్గం ప్లాస్టిక్ నిషేద కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వెయ్యి స్టీల్ ప్లేట్లు, వెయ్యి స్టీల్ గ్లాసులు తీసుకరావడం జరిగిందన్నారు. వీటిని దాతలు దంతాల ప్రభాకర్, తూర్పు గంగారెడ్డి గ్రామ పంచాయతీకి వితరణ ఇవ్వడం జరిగిందని గ్రామ సర్పంచ్ గడ్డం అని ఒక ప్రకటనలో తెలిపారు. మన గ్రామంలో అన్ని శుభకార్యాలకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, దీన్ని గ్రామస్తులందరూ వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామ సర్పంచ్ గడ్డం అనిల్, ఉప సర్పంచ్ భూమా రెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వప్న పాల్గొన్నారు.

## నూతన భవనం కేటాయించాలంటూ వినతి




**ప్రజాపక్షం, నిజామాబాద్ :** మహాత్మా జ్యోతిబా పూలే కాలేజీ ఆఫ్ ఎక్సలెన్సీ కోచింగ్ సెంటర్‌కు నూతన భవనం కేటాయించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం నాయక్ కోరారు. బుధవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు మహాత్మా జ్యోతిబాపూలే కాలేజీ ఆఫ్ ఆఫ్ ఎక్సలెన్సీ కోచింగ్ సెంటర్ సమస్యలపై వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అంతేగాకుండా పేద గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్యా అవకాశాలను పొందేందుకు ఈ కోచింట్ సెంటర్ కీలకంగా పని చేస్తోందని అందువల్ల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే నూతన భవనాన్ని ఉంచుకుని వెంటనే నూతన భవనాన్ని కేటాయించి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా యంత్రాంగాన్ని కోరారు. అదనపు కలెక్టర్ సమస్యను సానుకూలంగా పరిశలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సుభోద్, నీరజ్, సాయిపవన్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

